క్లుప్తంగా

నేడు రెడ్డిపల్లి వారపు సంత వేలం పాట

నల్లమాడ: రెడ్డిపల్లి వారపుసంత వేలం పాటను గురువారం ఉదయం 11 గంటలకు సర్పంచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సూర్యచంద్రారెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

సెంట్రింగ్ కూలీ ఆత్మహత్యాయత్నం


సల్మాన్ ఖాన్

ధర్మవరం రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సల్మాన్ ఖాన్ అనే సెంట్రింగ్ కూలీ బుధవారం విషపుద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స తర్వాత అక్కడి నుంచి అనంతపురం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాహుల్ జన్మదిన వేడుకలు

కదిరి టౌన్: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం కదిరిలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షానవాజ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పంచి పెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత


విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: యూనియన్ బ్యాంక్ ఉద్యోగి చంద్రకళ, గిరిధర్ దంపతులు సామాజిక సేవలో భాగంగా బుధవారం నాగలగుబ్బ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు తదితర విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, ప్రసాద్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఓడీచెరువు : మండల కేంద్రం ఓడీచెరువులోని సమీకృత బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారి రవీంద్రరెడ్డి తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 45 సీట్లు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు జూలై 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్, విద్యార్థి టీసీ, రేషన్‌కార్డు, తల్లి బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలతో వసతిగృహంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94905 93115 నంబరులో సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మ జాతర


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నల్లమాడ: గోపేపల్లి తండాలో గ్రామదేవత మారెమ్మ జాతరను మంగళ, బుధవారాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తండావాసులు అమ్మవారికి సామూహిక బోనాలు సమర్పించి పొట్టేళ్లు, కోళ్లు బలిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. బంధువులు, స్నేహితులు జాతరకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తండాలో పండగ వాతావరణం నెలకొంది. వానలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు, పశుసంపదతో ప్రజలు సంతోషంగా ఉండేలా దీవించాలని కోరుతూ ఐదేళ్లకోసారి మారెమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తండా పెద్దలు తెలిపారు. జాతర సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ద్విచక్ర వాహనాల ఢీ: ఒకరికి గాయాలు


గాయపడిన వ్యక్తికి వైద్యం చేస్తున్న సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని పులేటిపల్లి క్రాస్ సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒక వ్యక్తి కాలికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటంపల్లికి చెందిన చంద్రాయుడు ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పని నిమిత్తం చెన్నేకొత్తపల్లికి వస్తున్నాడు. పులేటిపల్లి సచివాలయంలో పని చేసే ఉద్యోగి చెన్నేకొత్తపల్లి నుంచి ద్విచక్ర వాహనాంలో వస్తున్నారు. వీరిద్దరూ పులేటిపల్లి క్రాస్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటంపల్లికి చెందిన చంద్రాయుడు కాలికి గాయాలయ్యాయి. వెంటనే 108లో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలిద్దాం


తూంచర్లలో విద్యార్థులతో కలసి ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


ఓడీ చెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కనగానపల్లి: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొంటోందని పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్–2047 కార్యక్రమంపై బుధవారం ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీలు చేపట్టారు. గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వచ్చే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి గురించి ప్రజలకు తెలియజేశారు. ఎర్రరక్తకణాల రుగ్మత వల్ల వచ్చే ఈ వ్యాధి తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వస్తుందన్నారు. దీనిని సకాలంలో గుర్తించి అవసరమైన మందులు వాడితే నయం చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్ వైజర్ శ్రీనివాసులు, ధనమ్మ, సీహెచ్ఓలు, స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రక్తహీనత ప్రాణాంతకం

ఓడీచెరువు : వారసత్వంగా వచ్చే ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమైన సికెల్ సెల్ రక్తహీనత వ్యాధి పట్ల అవగాహన, జాగ్రత్త లేకుంటే ప్రాణాపాయమేనని వైద్యాధికారి డాక్టర్ కమల్ రోహిత్ పేర్కొన్నారు. ప్రపంచ సికిల్ సెల్ రక్తహీనత దినం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, ఇతరులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి.. వ్యాధి లక్షణాలను, నివారణోపాయాలను వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రమణప్ప, సుభాషిణి, దిల్షాద్, విజయకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జూలై 1న బంజారాల సమ్మేళనం

- ఎల్‌హెచ్‌పీస్ రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ నాయక్
- విజయవంతం చేయాలని గిరిజనులకు పిలుపు


ఐక్యత చాటుతున్న బంజారా నాయకులు

పుట్టపర్తి టౌన్: 'మా తండాలో మా రాజ్యం.. ఎంత మంది ఉన్నామో అంత వాటా' నినాదంతో జూలై ఒకటో తేదీన హైదరాబాద్‌లో బంజారాల సమ్మేళనం నిర్వహించనున్నట్లు లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కై లాష్‌నాయక్ తెలిపారు. బుధవారం పుట్టపర్తి ప్రశాంతి గ్రామంలోని సమితి కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రవినాయక్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కైలాష్ నాయక్ హాజరై మాట్లాడారు. గిరిజనుల హక్కుల సాధన, వారి సమస్యల పరిష్కారం కోసం లంబాడీ హక్కుల పోరాట సమితి 1997 జూలై 1న ఆవిర్భవించిందన్నారు. 26 సంవత్సరాలు పూర్తి చేసుకొని 27వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జూలై ఒకటో తేదీన హైదరాబాద్‌లో బంజారాల సమ్మేళనం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి లంబాడీ మేధావులు హాజరవుతారన్నారు. గిరిజన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ నాయక్, నాయకులు నాగరాజునాయక్, శివ, శంకర్‌నాయక్, కుళ్లాయప్ప నాయక్, రంగనాథ్ నాయక్, రవీంద్రనాయక్, కిషోర్‌నాయక్, గోవిందునాయక్, బాటాజీ నాయక్, గణేష్ నాయక్, శ్రీనివాస్ నాయక్, విశ్వనాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి

పెనుకొండ: బాల్య వివాహాలపై ప్రజలు తగిన సమాచారం అందించి సహకారం అందించాలని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పిలుపునిచ్చారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని భువన విజయం సమావేశపు భవనంలో బుధవారం బాల్య వివాహాల నిర్మూలనపై ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల్య వివాహాల నియమ నిబంధనలు, బాలల చట్టాలపై మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ లక్ష్మీకుమారి మాట్లాడుతూ గతంలో బాల్య వివాహాల నిర్మూలనకు తగిన అధికార యంత్రాంగం లేదని, అయితే కొత్తగా వచ్చిన జీఓ మేరకు సిబ్బందిని పెంచడం జరిగిందన్నారు. అధికార యంత్రాంగం బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే స్థానికులు సైతం 1098 లేకపోతే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామస్థాయిలోని అధికారులు పకడ్బందీగా దీన్ని అమలు చేయాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి మహేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

'నీట్' మళ్లీ నిర్వహించాలి

పెనుకొండ: 'నీట్'లో అక్రమాలు జరిగినందున మరోసారి పరీక్ష నిర్వహించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. నీట్‌లో అక్రమాలను నిరసిస్తూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తర్వాత అంబేడ్కర్ సర్కిల్లో నిరసన తెలిపారు. ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దుర్వినియోగం, అవినీతి కొత్తది కాదని విమర్శించారు. తాజాగా విడుదలైన నీట్ ఫలితాలపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. నీట్‌ను తిరిగి నిర్వహించాలన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్వతంత్ర సంస్థతో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, రాకేష్, మనోజ్, సురేష్ నాయక్, సందీప్ పాల్గొన్నారు.

విశ్వశాంతి కోసం ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

పెనుకొండ: పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బైబిల్ మిషన్ మోక్ష మార్గోపదేశ సభలు చర్చిలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో బైబిల్ మిషన్ చర్చి ప్రతినిధులు జాన్సన్, దోన్‌కు చెందిన బండెల రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవులందరూ ప్రేమ, దయాగుణం, నీతి, సోదరభావం కలిగి ఉండాలన్నారు.

వైభవంగా దుర్గమ్మ జాతర


జ్యోతులు మోస్తున్న మహిళలు


అలంకరణలో దుర్గమ్మ

పావగడ: తాలూకాలోని నలిగానహళ్లిలో దుర్గమ్మదేవి జాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన దుర్గమ్మ ఉత్సవ ప్రతిమను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులు మోశారు. 14 సంవత్సరాలుగా దుర్గమ్మ జాతరోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ సమితి సభ్యులు తెలిపారు. జాతరకు తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కంది విత్తనాలకు నమోదు చేసుకోండి

ధర్మవరం రూరల్: ప్రభుత్వం సబ్సిడీపై అందించే కంది విత్తనాల కోసం అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ముస్తఫా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ధర్మవరం మండల వ్యాప్తంగా 4,139 మంది రైతులకు 3,800 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు చెప్పారు. కందులు అవసరమైన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నాలుగు కిలోల కందుల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సబ్సిడీ ధర పోను రైతులు రూ.392 ప్యాకెట్‌కు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విత్తన కందుల పంపిణీ

తాడిమర్రి: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం వ్యవసాయ అధికారులు సబ్సిడీపై విత్తన కందులను పంపిణీ చేశారు. ఎల్ఆర్‌జీ 52 రకం విత్తన కంది 40 శాతం రాయితీ కింద కిలో రూ.98 చొప్పున నాలుగు కిలోల బ్యాగును రూ.392కు పంపిణీ చేసినట్లు రైతు భరోసా కేంద్రం సిబ్బంది తెలిపారు. 12 మంది రైతులకు 1.50 క్వింటాళ్ల విత్తన కందులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కొత్తచెరువు: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన పలువురు విద్యార్థులకు పాముదుర్తి బయపురెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కేశాపురం హైస్కూలులో 577 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన రెడ్డి చైత్రకు రూ.10 వేలు, 572 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన షఫీన్‌కు రూ.7 వేలు, 569 మార్కులతో తృతీయ స్థానం సాధించిన తరుణ్‌కుమార్‌కు రూ.5వేల చొప్పున నగదు బహుమతిని ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం అందజేసి అభినందించారు. ఉన్నత విద్యలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

ఆదమరిస్తే అంతే..


చందమూరు వద్ద ప్రధాన రహదారిపై ఉన్న గుంత

చెన్నేకొత్తపల్లి: ఎన్ఎస్‌గేట్ నుంచి ధర్మవరం వైపునకు రోజూ వందలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. చందమూరు గ్రామ బస్టాండ్‌కు కొంత దూరంలో రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. ఏమాత్రం ఆదమరచినా ప్రమాదానికి గురికాక తప్పదు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయపడుతున్నారు. ఇది మలుపులో ఉండటంతో గుంతను గమనించక వేగంగా వచ్చిన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే ఈ రహదారిపై రోజూ పెనుకొండ సమీపంలో ఉన్న కియా కంపెనీకి చెందిన బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లాలి


పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి అర్బన్: విద్యార్థులు వినూత్న ఆలోచనా విధానంతో ముందుకెళ్తే జీవితంలో ఉన్నతంగా రాణిస్తారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కదిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం లియాఖత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎదగాలంటే స్కిల్ డెవలెప్‌మెంట్, పర్సనాల్టీ డెవలప్‌మెంట్ ఎంతో అవసరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ముద్రించిన పుస్తకాలు తాము ఎందుకు పంపిణీ చేయాలని ఆలోచన చేయకుండా ప్రజాధనం దుర్వినియోగం కాకూడనే ఉద్దేశంతో ఆ పుస్తకాలనే విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

టీకాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం


తాడిమర్రిలో చిన్నారులకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాడిమర్రి: వ్యాధి నిరోధక టీకాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీహెచ్‌ఓ హేమలత పేర్కొన్నారు. తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం చేపట్టిన వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఎంతమంది చిన్నారులకు ఏయే టీకాలు వేశారని ఏఎన్ఎం కోమలిని అడిగి తెలుసు కున్నారు. సీహెచ్ఓ మాట్లాడుతూ చిన్నారులకు తట్టు, పొంగు, క్షయ, పోలియో, కోరింత దగ్గు, కాలేయ వ్యాధి తదితర వ్యాధుల నివారణ కోసం ప్రతి బుధవారం చిన్నారులకు బీసీజీ, హెపటైటిస్ బీ, ఓపీవీ, పెంటా, పీసీవీ, రోటా, ఎమ్మార్ తదితర టీకాలు వేస్తారన్నారు. క్రమం తప్పకుండా వాటిని చిన్నారులకు వేయించాలని బాలింతలకు సూచించారు. మండలంలోని పలు విలేజ్ క్లీనిక్‌ల్లో చిన్నారులకు టీకాలు వేసనట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు కృష్ణమ్మ, సుగుణ, లక్ష్మీకాంతమ్మ, నాగలక్ష్మమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు చేయాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ సెల్వియా సోలమన్

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు చేయాలని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ సెలివ్యా సోలమన్ సిబ్బందికి సూచించారు. బుధవారం ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్య శిబిరాన్ని పర్యవేక్షించిన డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ.. గర్భవతుల పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం చెన్నేకొత్తపల్లి సచివాలయలం–1లో గర్భిణులకు చేస్తున్న వైద్య పరీక్షలపై ఆరా తీశారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయని గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందుతోందా అని ఆరా తీశారు. ప్రభుత్వాసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలపై గర్భవతులకు వివరించాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పోషకాల రేడు.. నేరేడు


నోరూరించే నేరేడు పండ్లు

- ప్రస్తుత సీజన్‌లో విరివిగా లభ్యం
- ఆరోగ్య ఫల ప్రదాయినిగా గుర్తింపు

హిందూపురం/చిలమత్తూరు/మడకశిరరూరల్: మనం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే.. ప్రకృతి సిద్ధంగా లభించే ఆహార పదార్థాలు ఎంచుకుంటే చాలు. అలాంటి పండ్లలో నేరేడు ఒకటి. ప్రస్తుత సీజన్‌లో నేరేడు పండ్లు అన్ని చోట్లా విరివిగా లభిస్తున్నాయి. నోట్లో వేసుకోగానే ఇట్టే కరిగిపోయే ఈ పండు పోషకాల గని.. అనారోగ్యాల నివారిణి అని వైద్యులు చెబుతున్నారు.

కిలో రూ.200 నుంచి రూ.250

ప్రకృతి ప్రసాదించే ఆహార పదార్థాల్లో ఒకటి నేరేడు. ఆరోగ్య ఫల ప్రదానియగా పిలిచే అల్ల నేరుడు పండును సక్రమంగా వినియోగించుకుంటే ఆరోగ్యానికి సంపూర్ణంగా మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. కోతకు వచ్చిన నేరుడు పండ్లు కోయడం చాలా కష్టంగా ఉంటుండడంతోనే ధర కూడా అధికంగా ఉంటుంది. వ్యవసాయ బోరు బావుల కింద రైతులు పెంచుకున్న నేరుడు చెట్లను కోనుగోలు చేసి ఆయా పట్టణాల్లో నాణ్యతను బట్టి కేజీ రూ. 200 నుంచి రూ.250 దాకా విక్రయిస్తున్నారు.

మెండుగా ప్రయోజనాలు

- నేరేడు పండ్లు జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు కల్గిస్తాయి.
- నేరేడులో పోటాషియం అధిక ఉంటుంది. ప్రతి వంద గ్రాముల పండ్లలో 55 మిల్లీగ్రాముల పోటాషీయం లభిస్తుంది.
- యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు వల్ల పళ్లు, చిగుళ్లు గట్టి దనాన్ని అందిస్తాయి.
- శరీరం డీ హైడ్రేషన్ కాకుండా ఇవి బాగా పనిచేస్తాయి.
- విటమిన్ సీ పుష్కలంగా ఉండటంతో రోగనిరోధక శక్తి పెంపొందిస్తాయి.
- క్యాల్షియం అధికంగా ఉండటం వల్ల ఎముకలకు బలాన్ని ఇస్తాయి.
- నేరేడు పండ్లు తింటే శ్వాసకోశ సంబంధ వ్యాధులు దూరమవుతాయి.
- మధుమేహ బాధితులకు నేరేడు వరంలా పనిచేస్తుంది. గ్లైకమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల డయాబెటిస్ వ్యాధికి చక్కగా ఉపయోగపడతాయి. నేరేడు పండ్లను తినడంతో పాటు గింజల్ని ఎండబెట్టి పొడిగా చేసుకొని నీటిలో కలుపుకొని తాగితే చక్కెర వ్యాధి తగ్గుతుంది.
- నేరుడు పండుతో పాటు నేరుడు బెరడు, ఆకులలోన కూడా వ్యాధులను నివారించే గుణాలు ఉన్నాయి. ఆహారంతో పాటు అనుకోకుండా వెంట్రుకలు కడుపులోకి వెళతాయి. అవి లోపలకి వెళ్లి ప్రేగులలో చుట్టుకోకుండా నేరేడు పండు తినడం వల్ల పేగులలో చుట్టుకున్న వెంట్రుకలను కూడా బయటకు పంపించే శక్తి నేరేడుకు ఉందని వైద్యులు చెబుతున్నారు.
- కిడ్నీలో ఉన్న రాళ్లను నివారించే గుణాలు నేరేడు పండులో ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. తరుచూ నేరేడు పండ్లు తింటే లివర్ శుభ్రం అవుతుంది.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి


తనకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తనకల్లు: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈఓ–2 కళ్యాణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, నల్లగుట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి బుధవారం 'నేను బడికి పోతా' కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ–2 కళ్యాణి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా బడి బయట ఉన్న ఆరేళ్ల నుంచి పద్నాలుగేళ్లలోపు వయసు కలిగిన పిల్లలను గుర్తించి వారిని తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీలను ప్రభుత్వం నియమించిందన్నారు. అనంతరం ఆయా గ్రామాల పుర వీధులలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.